రిక్షా గుమ్మం దగ్గర ఆగింది. బెల్ కొట్టాడు రిక్షావాడు.

ఆమెను దింపుకోవటానికి ఎవ్వరూ రాలేదు.

కొడుకు కోసం ఆత్రంగా చూచింది. చాప మీద కూర్చుని చదువుకుంటున్న పిల్లలు 'నానమ్మ వచ్చింది' అని అరుచుకుంటూ పరుగెత్తి రాలేదు! చూసీ చూడనట్టూరుకున్నారు.

ఆమె ఆశ్చర్యానికి అంతు లేదు! ఏమైంది? పిల్లలు అలా పట్టి పట్టనట్టూరుకున్నారు?

రిక్షావాడి సాయంతో దిగింది. ట్రంకు, బుట్ట, పరుపు చుట్ట లోపల పెట్టి డబ్బు తీసుకుని వెళ్ళిపోయాడు. పిల్లలు ఆమెను గమనిస్తున్నారుగాని మాట్లాడటం లేదు. ఆమెకు నవ్వు వచ్చింది. పోయిన వారమే వస్తున్నట్టు రాసింది. వారం రోజులు ఆలస్యమైనందుకు కోపం కాబోలు!

"అమ్మ స్నానం చేస్తోందా?" స్టూలు మీద కూర్చుని అడిగింది.

"ఊఁ" అంది పెద్ద మనుమరాలు వాణి పొడి పొడిగా.

"నాన్న కనబడడేం?"

"బజారు కెళ్ళారు" అన్నాడు మనవడు రాజా పట్టీపట్టనట్టు.

## కోమలాదేవి

ఎంతసేపు బిర్రుగా ఉంటారు? అనుకుని నవ్వుకుంది. లేచి వెళ్ళి బుట్ట తీసి డబ్బా తీసింది. అందులో ఏముంటాయో అందరికీ తెలుసు. పిల్లలిద్దరూ ఆ డబ్బాకేసి కళ్ళప్పకుండా చూస్తున్నారు. మూత తీసి వారి ముందర ఉంచిం దామె! అందులో లడ్లు ఉన్నాయి.

గబగబా చెరొకటి తీసుకున్నారు. కాని "నానమ్మా" అని ఆప్యాయంగా ఆమె మీదికి ఉరకలేదు! ఆమె మనసు గాయపడింది. మూడు నెలలు తను వారికి దూరంగా ఉంది. అంతలో ఇంత మార్పా? లడ్లు తీసుకుని తింటున్నారుగాని మనసున్న ప్రేమ ఏమైంది? తను అక్కడ లేనట్టే వ్యవహరిస్తున్నారు!


ఇంతలో కోడలు వసుధ వచ్చి కుశల ప్రశ్నలు వేసింది. "ఎంతసేపయింది మీరొచ్చి? వారు అలా బజారుకెళ్ళారు. వస్తూనే ఉంటారు. పోయిన వారం స్టేషన్ కెళ్ళారు. రాలేదు మీరు. ఆ తరవాత ఉత్తరం అందిందనుకోండి" ఆమె తగు రీతి జవాబు చెప్పింది. "కాస్త వేణ్ణీళ్ళు పెట్టు వసుధా. స్నానం చేస్తేగాని హాయిగా ఉండదు."

"ఇప్పుడే పెడతాను" ఆమె పిల్లల ఎదుట ఉన్న డబ్బా తీసేస్తూ అంది "అప్పుడే సగానికి వచ్చింది."

ఆమె నవ్వింది. "మూడేసి తిన్నా సగానికి వచ్చేసింది. చిన్న డబ్బాయే వసుధా. తీసెయ్. వాళ్ళ పిన్నమ్మ పంపినవే కదా!"

"ఇన్ని తింటే ఇక భోంచెయ్యరు" అంటూ వెళ్ళిపోయింది. కొంతసేపటికి స్నానానికి నీళ్ళు పెట్టి అత్తగారిని పిలిచింది. ఆమె స్నానం చేసి సేద తీరింది. అంతలో కొడుకు ప్రకాశ్ వచ్చాడు. తల్లిని పలుకరించి భోంచేసి వెళ్ళిపోయాడు. వసుధ పిల్లలు భోంచేసి బడికి వెళ్ళిపోయారు. అలవాటుగా ఆమె మెల్లగా అన్నీ సర్ది పెట్టింది. అప్పుడే భోంచెయ్యదు. కాఫీ పెట్టుకుని త్రాగింది. ప్రయాణపు బడలిక తీరలేదు. మంచం వాల్చుకుని పడుకుంది. ఎదురుగా గోడకు ఫోటో వ్రేలాడుతూంది.

వాణి, రాజా ఆరు — ఎనిమిది వయస్సులో ఉన్నారు. ఆరోగ్యానికే చిహ్నంగా నవ్వుతూ అందంగా ఉన్నారు. తను లేనప్పుడు తీసినట్లున్నారు.




కాని తనను చూడగానే ఆ నవ్వు ముఖాలు ఎందుకు వాడిపోయాయి? ఎందువల్ల వారు ముభావంగా ఉండిపోయారు? తన మీద తెచ్చుకోలు కోపం కాబోలు. అదంతా నటన! ఆమె అలా నిద్రలోకి జారిపోయింది.

ఒంటిగంటకు పిల్లలిద్దరు వచ్చి తలుపు తట్టగా మెలకువ వచ్చింది. ఆమె లేచి తలుపు తీసింది. ఇద్దరూ సంచులు గోడవారగా ఉంచి కాళ్ళు, చేతులు కడుక్కుని భోజనానికి కూర్చున్నారు.

ఆమె కూడా వారితోపాటు కంచం పెట్టుకుంది.

"మీకు నామీద కోపం వచ్చినట్టుంది. కదూ?" ఆప్యాయంగా అడిగింది.

"నాకేం కోపం లేదు."

"నాకూ లేదు."

ఇద్దరూ గబగబా అన్నారు.

ఆమె కంచాల్లో అన్నం పెడుతూంది. ఇద్దరూ గమనించి చూస్తున్నారు. వేడి గిన్నెలో నుంచి నెయ్యి ధారాళంగా వంపింది. అంటే నానమ్మ ఊరి నుంచి తెచ్చిందన్న మాట. చారు స్టౌ మీద పెట్టింది. కూర వడ్డించింది. "ఇక తినండి" అంది.

ఆమె నెయ్యి వేసుకోలేదు. కంచంలో అన్నం కూడా ఎక్కువ లేదు.

"నానమ్మా— అన్నం అంతే పెట్టుకున్నావేం?" వాణి అడిగింది.

"ఎక్కువ తింటే అరగదు తల్లీ. అందుకే కొంచెమే పెట్టుకుంటాను." మణి ఆ ప్రశ్న వేసినందుకు ఎంతో మురిసిపోయింది.

"తిని కూర్చుంటే ఏం అరుగుతుంది? పనా పాటా?" రాజా అన్నం కలుపుకుంటూ అనేశాడు. ఆమె వాడి మాటలకు విస్తుపోయింది. నోటి దగ్గరకు వెళ్ళిన చేయి ఆగిపోయింది. చేయి దించేసి మళ్ళీ కలుపుకుంది. "ఏమిటన్నావు రాజా?" అంది

దీర్ఘ వ్యాధులకు ఉత్తమసిద్ధవైద్యం!



నరముల బలహీనత
ధాతుపుష్టి యవ్వనశక్తి
హెర్నియా చర్మవ్యాధులకు
పోస్ట్ ద్వారా కూడా కలదు
వరిబీజం (బుడ్డ)
మూత్రవ్యాధులకు
ఆపరేషన్ లేకుండా-రండి

డా॥ దేవర, ఫోన్: 551, మార్కెట్ సమీపమున, తెనాలి.

బ్రాంచి: 26, నార్త్ బోగ్ రోడ్, మద్రాసు—17

చదవండి! చదివించండి!!

బాలభారతి

ఎక్కువ పేజీలు, అనుబంధ నవల కలిగిన పిల్లల మాసపత్రిక. వెల రూ 1·25

సంపాదకుడు: వి.వి. నరసింహారావు

సహకార సంపాదకుడు: శశిభూషణ్

పూర్తి వివరాలకు:

బాలభారతి

పో.బా.నెం 2645, మద్రాసు-600024.

దేహపుష్టికి ఆరోగ్యానికి

పండిత-డి.గోపాలాచార్యులవారి

జీవామృతం

1898 నుండి ప్రసిద్ధి గాంచినది

ఆయుర్వేదాశ్రమం
(ప్రైవేట్) లిమిటెడ్
మదరాసు-17.

ఉచితం ఉచితం !!

తెల్ల మచ్చలు

అన్ని రకాల మచ్చలను, ఎరుపు రంగును మా ప్రఖ్యాత మందు అయిదు రోజులలో మార్చును. త్వరలోనే చర్మము సామాన్యాలు రంగు పొందును. ప్రచారము నిమిత్తము ఒక పీసా మందు ఉచితంగా పంపబడును. వెంటనే వ్రాయండి. వివరాలకు:

BHARAT AYURVEDASHRAM,
P.O. Katri Sarai (Gaya)


మెల్లగా. పిడి నోట రావలసిన మాటలు కావే—అనుకుంటూంది.

"కాదా నానమ్మా—తిని కూర్చుంటే అరగదుగా. తిరిగి పని చేస్తే అరుగుతుంది."

ఆమెకు మ్రింగుడు పడలేదు. అన్నం కలుపుకుంటూనే ఉంది. ఒక్క ముద్ద నోట్లోకి వెళ్ళటం లేదు. పిల్లల ఎదుట అలా తినకుండా పారేస్తే వాళ్ళు కూడా అలాగే చేస్తారు. వృథా పోనివ్వకూడదు. చిన్న పిల్లడు ఏదో అన్నాడని సరిపెట్టుకుంది. అతి కష్టంతో ముద్ద ముద్దకు నీళ్ళు తాగుతూ ఎలాగో కంచం ఖాళీ చేసింది.

పిల్లలిద్దరు తిని లేచారు. ఆమె అన్నీ సర్దుకుంటూంది. మణి అక్కడే తారట్లాడుతూంది.

"ఏం కావాలమ్మా?" దగ్గరకు తీసుకుంటూ అడిగింది.

"మరే... నానమ్మా... వచ్చే వారం నా పుట్టిన రోజు కదూ... మంచి పట్టుపరికిణీ కుట్టించవూ?"

"అంత డబ్బు నా దగ్గరెక్కడి దమ్మా. నీ నాన్నతో చెప్పి చక్కటి గౌను తెప్పిస్తానులే" అంది అనునయిస్తూ.

మణి ముఖం నల్లగా మాడిపోయింది. ఏవగింపుగా అంది.

"నీ దగ్గరున్న డబ్బంతా ఏం చేస్తావో ఏమో! అంతా మా ఖర్చే కదా? బాబాయ్ పంపించే డబ్బంతా దాచి ఎక్కడ పెడుతున్నావో. దాన్లోనించి తీసి కుట్టించలేవూ?"

"బాబోయ్... ఈ పిల్ల ఏమంటూంది? ఇంత పెద్ద మాటలు దీని కెక్కడ వింటి వస్తున్నాయి?" అనుకుని బాధపడింది. జవాబుగా పాపని దగ్గరకు తీసుకుంది — కాని మణి విదిలించుకున్నట్టు వెళ్ళిపోయింది.

చిన్నపిల్ల—కోపం వచ్చింది... కాని ... అలా మాట్లాడుతుందేమిటి? అనుకుని బాధ పడిందామె.

రోజులు గడుస్తున్న కొద్దీ పిల్లల నోట వినరాని మాటలు వింటూంది...

"నువ్విక్కడుంటే బాగా డబ్బు ఖర్చవుతుంది..."

"పిన్నమ్మ బాగానే చూసుకుంటుందిగా—అక్కడుంటే బావుంటుందిగా?"

"నీకు కీళ్ళు నొప్పి నిజంగానే ఉందా?"

"నువ్వెప్పటికీ ఇక్కడే ఉంటావా?"

"నీ కోసం వేరుగా వండటం అమ్మకు కష్టం కాదూ?"

"అది వద్దు — ఇది వద్దు... అంటావు. మరి పాలు, పండ్లు మెక్కటం ఫరవాలేదా?"

"డాక్టరేకు — మందులకు బోలెడవుతుందిగా!"

"నువ్వు పల్లెలోనే ఉంటే మంచిది. అక్కడ అన్నీ చౌకగా దొరుకుతాయి."

ప్రథమంలో చిన్న పిల్లలు, తెలియనితనం, ఆకతాయితనం అనుకుని సరిపెట్టుకుంది. కాని రాను రాను ఆమెకు ఒక్కొక్క విషయం పూర్తిగా అవగాహన కాసాగింది. ఈ మాటల్ని వారికై వారు అనలేరు. ఎక్కడో విన్నారు. ఎవరి నోట విని ఉంటారు? ఇంకెవరు? తల్లిదండ్రులే! ఒక్కొక్కటి అర్థమయ్యేసరికి ఆమె హృదయం పెనలేని బాధకు లోనైంది. తను లేని సమయంలో కొడుకు, కోడలు ఏమేమో అనుకున్నారు. దాని ఫలితం ఇది. ఆ పసి హృదయాలు ఇంత కఠినంగా ఏ నాటికీ ఆలోచించలేవు. పిల్లలు ఇంత అనాలోచితంగా, ఇంత అమర్యాదకరంగా మాట్లాడుతున్నారంటే తనపై వారి కున్న ప్రేమంతా మాయమైపోయింది. దానికి కారణం ఆ తల్లిదండ్రులే. అంటే, తన కన్న కొడుకు, కోడలు!

ఆమెకు కన్నీరాగింది కాదు. ఈ వృద్ధాప్యంలో పిల్లలు తప్ప తన కెవరున్నారు. తనది అతి సాధారణమైన కుటుంబం కాదా! చిన్నప్పుడు కన్నవారింట్లో తను ఆడపిల్ల కనుక కొన్ని త్యాగాలు చేయవలసి వచ్చింది. ఆ తరవాత భార్యగా మరి కొన్ని త్యాగాలు... ఆ పిదప తల్లిగా మరి కొన్ని...! ఇప్పుడు విధవగా.. వృద్ధాప్యంలో—నిస్సహాయ స్థితిలో ఉన్నప్పుడు తనేం త్యాగం చెయ్యగలదు!

తిండి మానేసి ఒక మూల ఒదిగి కూర్చుని ఎవ్వరితో సంబంధం లేకుండా ఉండగలదా? తనకు కీళ్ళ నొప్పులని — వాతం అని చప్పిడి కూరలు తినాలి. తనకోసం ప్రత్యేకంగా వండాల్సిందే. మరి వారిలాగా తింటే మంచ మెక్కవలసి వస్తుందే! తన నెవరు ఆదరించి చూసుకుంటారు? పిల్లల నోటి వింటి వచ్చిన ప్రతి మాటకు తను తగిన రీతిన సమాధానం చెప్పగలదు. ఆ సమాధానం లేవిటో వారికి తెలుసు. కాని తన మీద ప్రేమ లేనప్పుడు అన్నీ కష్టంగానే ఉంటాయి.

దాదాపు మౌనమే శరణ్యమైంది దామెకు. పిల్లలు భోజనానికి వచ్చినప్పుడు తప్ప మిగతా సమయాల్లో వారిని దగ్గరకు తీసుకుని కథలు, కబుర్లు చెప్పటం తగ్గించివేసింది.

నెల రోజులు గడిచి పోయాయి.

కోడలు, కొడుకు బాగా మాటలు తగ్గించేశారు..

వాతావరణం బిగిసి ఉంది. రాజా జ్వరంతో వచ్చి పడుకున్నాడు. మామూలుగా మందు తెచ్చి వాడారు. మూడు రోజులకు కూడా తగ్గలేదు. డాక్టర్ వచ్చి చూసి వెళ్ళాడు. ఇంకా ఎక్కుతుందే కాని తగ్గలేదు.. సమర్థ స్కూలుకు సెలవు పెట్టింది. దాదాపు కొడుకు దగ్గరే కూర్చుంటుంది. లేని నోపిక తెచ్చుకుని ఆమె వంట వండి అన్నీ చూసుకుంటుంది. రాజా మంచం ఎక్కడంతో కొడుకు కూడా పూర్తిగా మాట్లాడడమే మానేశాడు. కొడుకు, కోడలు మంచాన్ని అంటి పెట్టుకుని కూర్చుంటున్నారు. వారిద్దర్నీ చూస్తూ భార భరిత హృదయంతో ఆమె గోడకు చేరగిలబడి చూస్తుంది

ఆమె కళ్ళ ముందు మరొక దృశ్యం మెదులుతోంది. ఆ నాడు ఈ కొడుకు అలాగే మంచం మీద ఒళ్ళు వి జ్వరంతో పడి ఉన్నాడు. అప్పుడు ఇంత మంచి మందులు ఉండేవి కావు. టైఫాయిడ్ వచ్చిందనగానే తన హృదయం విదారకంగా ఏడ్చింది. ఒక కొడుకుని అలాగే పోగొట్టుకున్నారు. ఈ మాటు చాల మంచి డాక్టర్ దగ్గరికి వెళ్ళారు. ఆయన వచ్చి చూసి వెళ్ళారు. ఈ రాత్రి గడిస్తే ఫరవాలేదంటూ

తడిగుడ్డతో వళ్ళు తుడవమని చెప్పి వెళ్ళిపోయాడు. దాదాపు మూడు గంటలు స్పాంజి బాత్ ఇచ్చింది. ఆ తరువాత తను, భర్త మంచాన్ని అంటి పెట్టుకు ఇలాగే కూర్చున్నారు.

ఒక రాత్రప్పుడు మెల్లగా కళ్ళు తెరిచాడు!

మందులకు డాక్టర్ ఫీజుకు చాలానే అయింది. అప్పుడే కానున్నర ఎత్తున్న పుస్తెలు అమ్మారు. ఆ తరవాత చేయించుకోటానికే వీల్లేక పోయింది. పోనీ ... పిల్లవాడు చల్లగా ఉన్నాడని తృప్తిపడ్డారు.

మంచంకోడుకు తల ఆన్చి వసుధ కునికిపాట్లు పడుతూంది. "పాపం ... నిద్ర సరిగాలేక ..." మెల్లగా లేచి కోడల్ని తట్టి లేపింది. "వసుధా ... వెళ్ళి పడుకోమ్మా. నేను కాసేపు నిద్రకాస్తాను."

అదేదో అనిదరాని మాట అంటున్నట్లు అత్తకేసి విభ్రాంతిగా చూచి సర్దుకుని కూర్చుంది. వారు భోజనం చెయ్యలేదని గుర్తుకు వచ్చింది.

"ప్రకాశ్ ... నువ్వైనా చెప్పు. కాస్త లేచి ముఖం కడుక్కుని భోంచేసి రండి. నేను కూర్చుంటాను. పిల్లవాడిని కనిపెట్టుకుని కూర్చోవటం మాటలు కాదు. ధైర్యం తెచ్చుకుని గబగబా వాలుగ్గ ముద్దలు తిని రండి. నీరసంతో నిద్ర కాయలేరు. ఇలా కునికిపాట్లు పడుతూంటే ఏం లాభం? వంతు వేసుకోవాలి. ఇద్దరూ ఒకేసారి కూర్చుంటే ఎలా?"

పీక్కుపోయి కళా విహీనంగా ఉన్న భార్య ముఖం కేసి చూచి మెల్లగా లేపుకుని వెళ్ళిపోయాడు.

"అమెకేం తెలుసండీ మన బాధ భోంచెయ్యాలిట. గిన్నె నిండుగా వండి పీకాలదాకా మెక్కి నిద్ర కాస్తుందట...."

"ష్ ... ష్" అంటూ ఆమె నోటిపై చెయ్యి ఉంచాడు.

కోడలు ఏదో అంటూందని ఆమెకు తెలుస్తున్న గానీ స్పష్టంగా ఏమీ వినబడలేదు.

ఆమె మంచం దగ్గర కూర్చుని తడి గుడ్డతో నుదురు, ముఖం, మెడ తుడుస్తూంది. జ్వరం కాస్త తగ్గినట్లు, తోచింది.

వాళ్ళిద్దరూ కంచాలు పెట్టుకుని మూతలు తీశారు. వండిన అన్నం వండినట్లే ఉంది. పాప తిన్న గుర్తుగా ఒక ప్రక్క కాస్త అన్నం తరిగి ఉంది. అన్నీ గమనించి ప్రకాశ్, భార్యవేపు చూచాడు. ఆమె ఇదేం గమనించనట్లు గబగబ అన్నం వడ్డిస్తూంది!

రెండు నిమిషాల్లో అయిందనిపించి చేయి కడుక్కున్నారు. కొడుకు దగ్గర అత్త కునికిపాట్లు పడుతుందని అనుకొంటూ ఆమె లోపలికి వచ్చింది.

రాజు నుదుటి మీద తడిగుడ్డ వేస్తూన్న అత్తగారినిచూచింది. తప్పు పట్టలేకపోయాననే అన్న బాధ ఆమెను వేధిస్తూంది.

"అమ్మా నువ్వు భోంచేయి వెళ్ళు."

"అమ్మా. . . నువ్వింకా భోంచేయ్యలేదా? వెళ్ళు" అని ఉంటే వెళ్ళి భోంచేసేదే. కాని కొడుకు అన్న తీరు ఆమెను నిరుత్సాహ పరిచింది. మౌనంగా కూర్చుంది. కాని ఆమె కళ్ళల్లో నీళ్ళు సుళ్ళు తిరిగి చెక్కిళ్ళ మీదుగా కారినై అత్తగారి చేతిలో నుంచి తడి గుడ్డ తీసుకుంది వసుధ.

"ఇక చాలు. బాబుకు జ్వరం తగ్గినట్లుంది. థర్మామీటర్ పట్టా ప్రకాశ్"

రాజుకు జ్వరం తగ్గింది. అంతే చాలు. ఆమె తన స్థానం అక్కడ కాదు అన్నట్లు లేచి గోడ దగ్గరకు వెళ్ళింది. గోడకానుకుని గట్టిగా కళ్ళు మూసుకుంది. . .

"ఆనాడు అచ్చం ఇలాగే . . . . వారం రోజులు జ్వరం పీడించింది నిన్ను. . . టైఫాయిడ్ అనుకున్నాం. అంతకు ముందు మీ అన్న ఈ జ్వరంతోనే... అందుకే మంచి డాక్టర్. . ."అంటూ ఆమె చెప్పడం ప్రారంభించింది. అంతా చెప్పటం పూర్తయింది. . ." బంగారు పుస్తెలు లేకపోతే పోయాయి. . ." కాని బంగారంలాంటి కొడుకుని దక్కావు నాయనా. . . అంతా ఇంతే. . . నేను, మీ నాన్న నీ మంచం దగ్గర కనిపెట్టుకుని కూర్చుని ఆదుర్దా పడ్డాము. . అలాగే రాజా దగ్గర నువ్వు, వసుధ. . . అలాగే రాజాబాబు పెద్దవాడై తన కొడుకు విషయంలో ఆదుర్దా పడుతుంటాడు. . . ఇది జననీ జనకుల చక్రం. . . అటు చూడండి. . . రాజు కళ్ళు తెరుస్తున్నాడు. ."

ఆమె లేచి వెళ్ళిపోయింది.

వసుధ, ప్రకాశ్ పట్టరాని ఆనందంతో కొడుకు తల నిమిరారు. వసుధ గ్లూకోజు నీళ్ళు స్పూన్‌తో పోసింది. వాడు త్రాగి కాస్త అటూ ఇటూ చూచి ఏడుకున్నాడు. ప్రకాశ్ ఒకటే ఆలోచిస్తున్నాడు. "మా అమ్మకు బంగారు పుస్తెలు లేవనుకునే వాడిని, కాని వాటి వెనక ఈ కథ ఉందని నాకు తెలియదు" అన్నాడు బాధగా.

వసుధ పెదాలు విరిచింది. "ఏ తల్లి అయినా అలానే చేస్తుంది. ఇందులో పెద్ద విచారించ వలసిందేం లేదు."

"అవును సుధా—ఏ తల్లి అయినా అలాగే చేస్తుంది. నువ్వు కూడా చేస్తావు. వీడు నీ కొడుకు. వీడి కోసం నీవు ఏమైనా చేయగలవు. వీడింకా చిన్న వాడు. వీడి నుంచి ఇప్పుడు నువ్వేమి ఆశించవు. ."

"మీ రనేదేమిటి?" ఆమె మెల్లగా ప్రశ్నించినా కంఠంలో విసుగుదల స్పష్టమైంది.

"ఏనాడో అనవలసిన మాట— మూర్ఖత్వంతో అనలేక పోయాను. నేను మా అమ్మ కొడుకును. నాకోసం ఆమె అన్నీ చేసింది. నేను పెద్దవాడినై పోయాను. నా నుంచి ఆమె అప్పుడు ఏం ఆశించ లేదు. కాని ఇప్పుడు నా అవసరం ఆమె కెంతైనా ఉంది,"

"ఆ విషయం మీ రిప్పుడు గ్రహించారా?" ఎత్తిపొడుస్తూ అంది.

ఆ విషయంపై వాదించడానికి అతడికి ఓపికా లేదు. ధైర్యం లేదు. తెగించి మాట్లాడినా గట్టిగా మాట్లాడితే తల్లి వింటుంది. వసుధ ఇలాంటి విషయాలలో అతి సులువుగా నోరు పెద్దది చేస్తుంది. అప్పటికి మౌనంగా ఉండిపోయాడు.

రాజుకు స్వాస్థ్యం చేకూరి బడికి వెళ్ళడానికి నెల రోజులు పట్టింది. నెలాఖరు అని డబ్బుకోసం తడుముకున్నారు. వసుధ టీచరుగా, ప్రకాశ్ యు. డి. సి. గా పని చేస్తున్నారు. డబ్బు విషయంలో వారికి ఎక్కువ ఇబ్బంది లేదు. అప్పు కూడా త్వరలో పుట్టించగలరు. కాని వసుధ మాత్రం అత్త గారి ఎదుట డబ్బు లేదు లేదంటూ హడావిడి పడుతూంటే, తను దాచుకున్న డబ్బులో నుంచి ఏభై ఒకమాటు, ముప్పై ఒకమాటు తీసి ఇచ్చింది. ఆ డబ్బుతోనే వాడికి కావలసిన హార్లిక్స్, మందులు కొన్నారు.

# ఆవిష్కృతి

తరతర లాడుతూ
తాటాకు మంటలాగా
చప్పున ఎగసి
చల్లారి పోయేది కాదు
నా జాపకం
నీ లోపల!

నేను చల్లగా
అందని జాబిల్లిగా
నీ గుండెలో వెలిగే
గుప్త జ్వాలను!

నా జ్ఞాపకాలు
నక్షత్రాలై మినుకు మినుకుమంటూ
నా హృదయాకాశంలో
ఎప్పుడూ నిలిచి!

నీవు పీల్చే గాలిలోని
కమ్మని మట్టి వాసనను నేను!
నీ చుట్టూ కమ్మే
వర్ష శీకర శైత్యంలోని
ఆహ్లాదాన్నే నేను!

నడి సేతువులో
నీ పసి మనస్సు వెతుక్కునే
అమ్మ ఒడి వెచ్చదనాన్ని నేను!
నేను నీ నెచ్చెలిని
నీ నీడను!

నా వైపుకు
ఒక్క క్షణమైనా
ఊహను సారించకుండా ఉండలేని
అశక్తతను నీలో పెంచే
నేను ప్రేమను!
నీ ప్రాణాన్ని!

-నాయని కృష్ణకుమారి

రాజా మళ్ళీ బడికి వెళుతున్నాడు. ఎవరికి వారు యాంత్రికంగా రోజులు వెళ్ళబుచ్చుతున్నారు. నెలరోజుల క్రితం ఒక రాత్రి వేళ ప్రకాశ్ తల్లిని గూర్చి బాధ పడ్డాడు. తల్లిగా ఆమెను గుర్తించి, తన ప్రవర్తనకు నొచ్చుకున్నాడు. కాని రోజులు గడిచే కొలది అదంతా ఒక అర్ధరాత్రి కలలా కరిగి పోయింది. తల్లి, తండ్రి నానమ్మ విషయంలో దూర దూరంగా ఉండటం గమనిస్తున్న రాజు— తను కూడా దూరంగా ఉండి పోతున్నాడు.

రాజా పడకలో ఉన్నప్పుడు దగ్గరగా కూర్చుని ఎన్నో కథలు చెప్పేది. "నానమ్మా— నానమ్మా." అంటూ ఆమెను క్షణం కదల నిచ్చే వాడు కాదు. అలాంటిది వాడు ఏమీ పట్టనట్టు నానమ్మతో తనకేం సంబంధం లేనట్టుగా వ్యవహరి స్తుంటే ఆమె హృదయం మూగగా రోదించింది.

ఆ తరవాత తన విషయంగా కోడలు, కొడుకు ఘర్షణ పడటం మామూలు అయిపోయింది. ఆమెకు వినిపించరాదనే అన్నట్లు పోట్లాడుకునే వారు. నిజంగానే వివరంగా తెలిసేది కాదు గాని తన మూలంగా వారిద్దరూ మాటామాట అనుకుం టున్నారని గ్రహించటానికి పెద్ద తెలివితేటలు అక్కర్లేదు. అలాంటి సమయంలో మనుమ పిల్లల్ని తిట్టేది— విసుక్కునేది — ఒక్కో మాటు కొట్టేది. ఎవరి మీదనో ఉన్న కోపమంతా పిల్లల మీద చూపేది. రాజుకు తల్లికి తనపై కోపం ఎందుకో తెలిసి పోయింది. అమ్మకు నాన్నకు నానమ్మ మీద కోపం ఆమె అంటే, వారికి ఇష్టం లేదు. అసలు ఆమె ఇక్కడే ఉండటమే వారికి ఇష్టం లేదు. ఆమె ఉంది. అందుకే తల్లి ఇలా ప్రవర్తిస్తూంది. అనుకునే వాడు. ఒక విధమైన కక్ష వాడిలో ప్రవే శించింది.

అంజా అకారణంగా తల్లి చేతిలో దెబ్బలు తిన్న రాజా గబగబ నానమ్మ దగ్గర కెళ్ళి "ఏయ్ ముసలి దానా—నువ్వెక్కడికైనా వెళ్ళిపో. అప్పుడు అమ్మకు కోపం రాదు." అని సంచి తీసుకుని పరుగులమీద కళ్ళు తుడుచుకుంటూ వెళ్ళిపోయాడు.

ఆమె విశ్చేష్టితయ్యింది. "ఏయ్... ముసలి దానా." ఎంత మాటన్నాడు. వాళ్ళిద్దరూ తనను అలాగే అన్నారు కాబోలును? నిస్సహాయురాలైన ఆమెకు దుఃఖం కట్టలు తెంచుకుంది. పసిపిల్లల హృదయాలలో తనొక పనికి మాలిన ముసలి దానిలా మిగిలి పోయిందా? నానమ్మగా, మంచి నానమ్మలా— తండ్రి తల్లిలా ఆ హృదయాల్లో స్థానాన్ని కోల్పోయిందా? అలా జరగటానికి వీలేదు. ఆ పిల్లలు తనను గూర్చి అంత హీనంగా తలంచరాదు. ఆమె తీక్షణంగా ఆలోచిస్తూంది. దీనికి మార్గ మేమిటని.

ఆ రాత్రి పిల్లలిద్దరూ నిద్రపోయిన తరవాత ఆమె కొడుకునీ, కోడలినీ పిలిచింది. ఏమిటో అని ఇద్దరూ వచ్చారు.

"కూర్చోండి. మీతో కొంచెం మాట్లాడాలి."

"అమ్మా... ఇప్పుడా... నిద్ర వస్తోంది" విసుగ్గా అన్నాడు.

"ఫరవాలేదు. ఇప్పుడే మీకు తీరిక. అదీ కాక పిల్లలిద్దరూ నిద్రపోతున్నారు"

భార్యాభర్తలు ముఖాలు చూసుకుని కూర్చు న్నారు.

"నే నిక్కడ ఉండటం మీ కిష్టం లేదని నాకు తెలుసు... అవునా?"

"అహ... అది గాదు..." అతడు మాటలు నాన్చాడు.

"నా వల్ల మీకు ఎన్నో ఇబ్బందులని కూడా తెలుసు. నా తిండికి, మందులకు ఎంతో ఖర్చవు తుందని కూడా తెలుసు. నాకు పథ్యం కూడా ఉండాలని తెలుసు! కాని... నేను ఎక్కడి కెళ్ళ గలను? ఈ కాళ్ళు చేతులు ఆడేవరకు వేరుగా ఉండ గలను. కాని నా ఇంటి అద్దెకే ముప్పై నలభై అవుతాయని ఆనాడు మీరే అన్నారు. మళ్ళీ తీసు కొచ్చేశారు. పోనీ మా తమ్ముడి దగ్గర ఉందా మంటే ఆ సముద్రపు గాలి పడక నాకు మరీ సుస్తీ చేస్తుందని నాకు తెలుసు. వాడికి చెయ్యి విరిగిందంటే వెళ్ళాను. ఒక్కడే సంపాదిస్తున్నాడు భార్యకు పని లేదు. అందుకే నేను నీదగ్గర ఉండవలసి వస్తూంది. నాకని ప్రత్యేకంగా నెల నెల ముప్పై రూపాయలు పంపుతున్నాడు. ఆ ముప్పై నేను చేస్తున్నానురా? ఒక గుడ్డ ముక్క కొనుక్కుంటున్నాను. ఆ మిగిలింది, ఈ ఇద్దరు మనుమలకు, మనుమరాళ్ళకు ఏదో ఒకటి చేతిలో పెడుతుంటాను. అంతకు మించి నా దగ్గర ఏముంది? అలాంటి పరిస్థితుల్లో నేనెక్కడి వెళ్ళగలను బాబూ? నేను మీకు ఏవిధంగాను సహాయపడలేను — పైగా భారంగా ఉండిపోతాను. కాని నేనేం చెయ్య గలను. అంజా వచ్చేవరకు మీరు భరించాలి



తప్పదు."

"ఇదంతా ఎందుకండీ... మీకేం తక్కువ చేస్తున్నాను?" కోడలు చిరాకుపడింది.

"ఈ వయసులో ఈ [illegible] శరీరానికి కావలసినవే తక్కువ అంటున్నాను వసుధా. పిల్లలకూ నానమ్మ మీద ప్రేమ లేదు. నేను ఎందుకు పనికిరాని ముసలిదాన్ని. రాజు ఉదయాన ఏమన్నాడో తెలుసా? ఏయ్ ముసల్దానా నువ్వు ఇక్కడి నుంచీ వెళ్ళిపో. మా అమ్మకు కోపం రాదు" అన్నాడు.

అంతేకాదు నేను వచ్చినప్పటినుంచి చూస్తున్నాను పిల్లలు ఎన్నో అసందర్భమైన మాటలు మాట్లాడుతున్నారు. వారు ఈ మాటలు ఎలా మాట్లాడగలుగుతున్నారు?" ఆమె పిల్లలు అన్న ఒక్కొక్క మాట చెప్పింది. ఆ తరవాత అంది: "అవన్నీ స్వతహాగా అనలేదు. వాటిని విన్నారు. ఎవరో మాట్లాడుకోగా విన్నారు. మీ రిద్దరు నా గురించి అంత తేలికగా మాట్లాడుకోవటం విన్నారు. ప్రథమంలో చిన్న పిల్లలు — తెలిసీ తెలియనితనం అని సరిపెట్టుకున్నాను. కాని రాను రాను వారిద్దరూ మీరన్న ప్రతి ఒక్కొక్క మాటను గుర్తుంచుకుని నన్ను అదే మాట అన్నారు. అప్పుడు తెలిసింది. పిల్లల ఎదుట నా గురించి మీ రేమేమి అనుకున్నారో."

"అమ్మా ... అలా అనలేదు ..." ప్రకాశ్ సమర్థించుకోబోయాడు ఆమె అడ్డు తగిలింది'

ఒద్దు. నిన్ను నీవు సమర్థించుకొని మరి అబద్ధాలాడ నవసరం లేదు. ఈ సమయంలో మిమ్మల్ని నేను కోరేది ఒక్కటే ప్రకాశ్! పిల్లల దృష్టిలో నన్ను హీనపర్చకండి మునుపు వా రిద్దరు నా దగ్గర కూర్చుని ఎన్నో కబుర్లు చెప్పుకునే వారు. చదువు చెప్పించుకోటానికి కూడా నా దగ్గరకే వచ్చేవారు. మీరు కోప్పడితే నా ఎదలో దాక్కునేవారు. నా పై వారికున్న ఆ అనురాగం ఆప్యాయత ఏమై పోయాయో మీకు తెలుసు. వారు తిరిగి ఆ విధంగా ప్రవర్తించాలంటే మీరు ఒక్క పని చేయాలి. నా గురించి వారి ఎదుట తేలికగా మాట్లాడకండి. వారిహృదయాల్లో నేను పూర్వపు నానమ్మనై పోవాలి. ఆ నానమ్మనే వారి హృదయాల్లో ప్రతిష్ఠించుకోవాలి. మీరు నన్ను భరించక తప్పదు. నేను ఎక్కడికీ వెళ్ళలేను. ఎందుకంటే మీకు నా అవసరం ఉండి పిల్లలు చిన్నవాళ్ళుగా ఉన్నప్పుడు మీ తమ్ముడి దగ్గరనించి తెచ్చుకున్నారు. ఎనిమిది సంవత్సరాలు దాటి పోయాయి. ఇప్పుడు నన్ను వెళ్ళగొట్టాలనుకోకండి. మీరు చాటు మాటుగా నన్ను తిట్టండి, ముసల్దీ, అని అనుకోండి. విసుక్కోండి ... కాని పిల్లల ఎదుట ఆ మాటలు అనకండి. పిల్లలు పెద్దవా ళ్ళవుతున్నారు. మీ ఇద్దరు నన్ను ప్రేమతో ఆదరిస్తున్నట్లు కనబడండి చాలు. నా వల్ల మీ కెన్నో ఇబ్బందులు కలుగుతున్నాయని తెలుసు. కాని నేను నిస్సహాయురాల్ని. నా కోసం మందులు పళ్ళు కొన నవసరంలేదు. మీ తమ్ముడు పంపిన దాన్లో ఖర్చై అంతా మీరే తీసుకోండి. ఈ అవసాన దశలో నాకు కావలసింది ఒక్కటే. అది ఆ చిన్న వాళ్ళిద్దరి ఆప్యాయత. నానమ్మా అని మునుపటి లా నా చుట్టూ తిరిగితే చాలు."

ఆ మాటలు అంటుంటే ఆమె కంఠం జీరబోయింది. ఆ తరవాత కన్నీళ్ళు ఏకధారగా ప్రవహించాయి. కొంగుతో కన్నీళ్ళు తుడుచుకుందామె. ప్రకాశ్ తల్లి ఒడిలో తల పెట్టి "అమ్మా నన్ను క్షమించు" అంటూ ఏడ్చాడు. ఆ మాతృ హృదయం ద్రవించి పోయింది. కొడుకు కన్నీరు తుడుస్తూ అనునయించింది. "ఏడవకు ప్రకాశ్ .. నీ కిష్టమున్నా లేకపోయినా నే నిక్కడ ఉండాలి. నీ కిష్టమున్నా లేకపోయినా నువ్వు నన్ను నీ దగ్గర ఉంచుకోవాలి. మరో మార్గం లేదు కాని మనిద్దరి మధ్య ఆ పిల్ల లిద్దరూ నలిగి పోకూడదు. తల్లి కొడుకుల మధ్య ఉన్న ప్రేమానురాగాలను మాత్రమే వారిని చూడనీ. ఆ విధంగా నటించండి. మిగతా భావాల్ని ఆ పిల్లల నించి నిగూఢంగా ఉంచండి. రేపు మీరు మంచి నాన్నమ్మ తాతయ్య అవుతారు వారు మంచి అమ్మగా నాన్నగా అవుతారు."

ఆ తల్లి కొడుకులను వదిలి వసుధ మెల్లిగా వెళ్ళిపోయింది. ఆమెలో పరివర్తన తాలూకు కన్నీరు చెక్కిళ్ళ మీదుగా జారినాయి.

మరునాటి రోజు అంతా క్రొత్తగా ఉంది. పిల్లలిద్దరూ లేచి కాఫీలు త్రాగడానికి వచ్చేసరికి వంట ఇంట్లో సందడిగా ఉంది.

"ఇవ్వాళ అమ్మ మినపరొట్టె చేసింది రాజూ నీకిష్టం కదూ. ఇలా వచ్చి కూర్చో. . .వసుధా, రాణికి బుల్లి మినపరొట్టె వేయి. . ." పిల్లలిద్దరూ ఆమెకు చెరో ప్రక్క కూర్చున్నారు. ఎంతో అలవాటుగా మురిపెంగా కూర్చున్నారు. బాబు చిన్న ముక్క త్రుంచి ఆమె నోటి కందించాడు. పాప మరోటి అందించింది. ఇద్దరివి అందుకుని నోట్లో వేసుకుంది.

"ఎంత తియ్యగా ఉన్నాయో!"

"బలే. . .బలే. . . పంచదారతో పెట్టలేదు. తీపి ఎక్కడిది?"

"ఈ బుల్లి చేతిలో ఉంది" అంటూ ఆమె రాణి ఎడమ చేతిని మృదువుగా నొక్కింది.

"మరి నాదో?" బుంగమూతి పెట్టాడు.

"నీది కూడా. . .ఇద్దరివీ తిన్నానుగా?" ఆమె మనవడి భుజం చుట్టూ చేయి వేసింది.

"మీ అమ్మది. . .నాన్నది కూడా ఇలాంటివే. ."

"నాన్నా నాకు పెట్టు. . .నాకు పెట్టు. . ."

బాబు పెద్దవాడు గనక మెల్లగా అన్నాడు కాని పాప హుషారుగా కేకలేస్తోంది. ప్రకాశ్ పిల్లలిద్దరికీ చేరో చెంచాడు పంచదార వేశాడు.

"అబ్బో. . . మీ నానమ్మగా రన్నట్లు మీ నాన్న చేయి పంచదార [illegible] మామా?" వసుధ అంది.

అందరూ హాయిగా నవ్వారు.

పిల్లలు పంచదారలో అద్దుకు తింటున్నారు.

"రొట్టెలో చిరు చేదంతా పోయింది—" బాబు అన్నాడు పంచదారను మరికాస్త వేసుకుని.

"అవును రాజా. . .ఎన్నిటిలోనో చిరు చేదు ఉంటుంది. దాన్ని లెక్కించకుండా తినాలి. లేదా మరి కాస్త రుచిగా ఉండాలని పంచదార వేసుకోవాలి."

ఆమె మాటలకు ప్రకాశ్ తలెత్తి చూచాడు.

ఆమె ముఖం ప్రసన్నంగా ఉంది. చిరునవ్వు నవ్వింది.

అవును, అమ్మ జీవితంలో ఎన్నో రకాల చిరు చేదు లున్నాయి. దానికి విరుగుడుగా తన చేతిలో పంచదార కరువు కాలేదు.

"నాన్నా పంచదార పాప అడిగింది." ★

వీణాధరి

చిత్రల — పి. పద్మావతి

